క్లుప్తంగా

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు

నిడమనూరు : మండలంలోని ముప్పారం గ్రామంలో ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా చిత్రం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా అల్లంపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు చిత్రం మైసయ్య, చేగుంట శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారికి పూజలు చేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మిర్యాలగూడ కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనను కలిగి ఉండాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఆర్టీసీ ఈయూ నేతలు



దీక్షలో పాల్గొన్న నల్లగొండ రీజియన్ యూనియన్ నేతలు

మిర్యాలగూడ టౌన్ : హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ వెంటనే ఆర్టీసీలో గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే సామూహిక దీక్షకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నాయకులు మంగళవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో డిపో యూనియన్ కార్యదర్శి కెవి రెడ్డి , వివిధ డిపోల యూనియన్ నాయకులు ఎస్. మంగ, ఎన్ఆర్‌సి రా.ఉ, జగదీష్, ఎస్‌సి సైదులు, కెఎస్ రావు, వెంకన్న తదితరులున్నారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేయించుకుంటున్న వ్యక్తి

మాడుగులపల్లి : మండలంలోని చిరుమర్తి గ్రామంలో కంటి వెలుగు శిబిరం ఐదోరోజు కొనసాగింది. మంగళవారం సిబ్బంది 150 మందికి పరీక్షలు నిర్వహించారు. 19 మందికి కళ్లద్దాలు, 32 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేసినట్లు పాములపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్‌కుమార్ తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ జానయ్య, ఏఎన్ఎం వనజాత, సులోచన, సూపర్‌వైజర్ రజినీ, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని మూడో వార్డుకు చెందిన శ్రీపతి జక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు రమేష్ జీ, మోహన్ నాయక్, ఆదాస్ విక్రం తదితరులు ఉన్నారు.

పల్లెల్లో 'బెల్ట్' దందా

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్‌షాపులు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- పలు ప్రాంతాల్లో ఎమ్మార్పీ విషయమై ఘర్షణ



హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. ధరల విషయమై నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు ఘర్షణలకు తవిస్తోంది. అయితే ఎక్సైజ్ అధికారులు మాత్రం ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రకటనలు ఇస్తూ..బెల్ట్ దందాపై దృష్టి సారించడం లేదు. బెల్ట్ దుకాణాలు, వైన్స్ యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు వస్తుండడంతోనే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గుడుంబా తయారీ, అమ్మకాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పల్లెల్లో బెల్టుషాపుల జోరు ఊపందుకుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతోంది. నియోజక వర్గంలోని గ్రామాల్లో గుడుంబా నియంత్రణలోకి రాగా మద్యపాన ప్రియులు తమ దృష్టిని మద్యం వైపు మళ్లించారు. దీంతో గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు అమ్మకాలు ఊపందుకోవడంతో ప్రస్తుతం వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నియోజకవర్గంలో 179 గ్రామపంచాయతీల్లోని గ్రామాల ప్రజలు ఏ రోజుకు ఆ రోజు కూలీ పని చేసుకొని జీవనం సాగించే వారు అధికంగా ఉన్నారు. రోజంతా ఒళ్ళు గుల్ల చేసుకొని కష్టపడి సంపాధించి న డబ్బులను చాలా మంది మద్యానికి ఖర్చు పెడుతున్న మూలంగా ఆయా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి.

నియోజకవర్గ వ్యాప్తంగా 800లకుపైగానే..

నియోజకవర్గ వ్యాప్తంగా 18 వైన్ షాపులు ఉండగా 800లకు పైగానే బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లోని కిరాణం షాపులు, హోటళ్లు..ఇలా దాదాపు అన్ని షాపుల యజమానులు ఒకరిని చూసి మరొకరు బెల్ట్ దుకాణాలు మొదలు పెడుతుండడంతో ప్రతీ గ్రామంలో వీటి సంఖ్య ఆరు నుంచి పదిరి చేరింది. అయితే మద్యం ధరలు ఆ బెల్ట్ షాపుల్లో అధికంగా ఉంటున్నాయి. సహజంగానే వైన్స్‌షాప్ యజమానులు ఎమ్మార్పీపై రూ.5నుంచి రూ.10 వరకు అదనంగా తీసుకుంటున్నారు. ఇక అధికారులు మామూళ్ల ఇతరత్రా ఖర్చులు, తమ లాభం కలిపి బెల్ట్‌షాపుల యజమానులు మరికొంత ధర పెంచుతున్నారు. ఇక వేసవి వస్తే బీరును రూ. 230 మొదలు రూ. 250 వరకు కూడా విక్రయిస్తుండడంతో గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇష్టారీతిన ఎలా విక్రయిస్తారంటూ మద్యం ప్రియులు బెల్ట్ షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

గ్రామాల్లో బహిరంగంగా బెల్ట్‌షాపుల నిర్వాహణ సాగుతున్నా ఎక్సైజ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ఎక్కడికక్కడ ఉద్యోగుల కనుసన్నల్లోనే షాపుల నిర్వాహణ కొనసాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. నెలవారీ మామూళ్ల కారణంగా వారు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కొని వైన్స్‌ల యజమానులు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ..ఇతర షాపుల్లో కొనుగోలు చేస్తే తాము మచ్చిక చేసుకున్న ఎక్సైజ్ ఉద్యోగులతో దాడులు చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.

బార్లను తలపించేలా సౌకర్యాలు..

పలు బెల్ట్‌షాపుల నిర్వాహకులు పట్టణాల్లోని బార్లు, రెస్టారెంట్లను తలపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చీప్ లిక్కర్ మొదలు ఖరీదైన బ్రాండ్ల వరకు విక్రయిస్తుండడమే కాక సిట్టింగ్ ఏర్పాటు చేసి చికెన్, ఇతర తినుబండరాలు అన్ని సమకూరుస్తున్నారు. ఇక వైన్స్, బార్లు సమయానుకులంగా నడుస్తుండగా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలు మద్యం లభిస్తుందని చెబుతున్నారు. చాలా చోట్ల బెల్టుషాపులు నిర్వహించే నిర్వాహకులు మద్యం సీసాల్లో మద్యాన్ని తొలగించి నీళ్లు కలుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా అధిక ధర ఉన్న మద్యం సీసాల్లో నుంచి మద్యం తీసి తక్కువ ధరకు లభించే మద్యాన్ని వాటిలో కలుపుతూ ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

బెల్టుషాపులు నియంత్రించాలి



పల్లెల్లో బెల్టుషాపుల కారణంగా కావాల్సిన మద్యం దొరుకుతుంది. సామాన్య, మధ్య తరగతి వారు నిత్యం తాగి తూగుతున్నారు. కాయకష్టం చేసి సంపాదించిన మొత్తం మద్యానికే ఖర్చు చేస్తున్నారు. అధికారులు దీనిపై దృష్టిపెట్టి బెల్టుషాపులు లేకుండా చూడాలి.
–షేక్ ఇబ్రహీం, ముకుందాపురం

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో బెల్టు దుకాణాలు నడుపుతున్నట్లు ఎవరైన ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆరు నెలల క్రితం అనుముల గ్రామ శివారులో ఓ తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన 42 క్వాటర్ల కల్తీ మద్యాన్ని సీజ్ చేసి, ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశాం. వైన్స్‌లోనూ ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే షాపులను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తాం.
– వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ, హాలియా

దశాబ్ది వేడుకలను జయప్రదం చేయాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జాన్‌యాదవ్



కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలరాజురెడ్డి

దేవరకొండ : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న దశాబ్ది వేడుకలతను జయప్రదం చేయాలని దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ కోరారు. మంగళవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న ప్రారంభమై 21 రోజుల పాటు కొనసాగనున్న దశాబ్ది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. 21 రోజుల పాటు జరగనున్న ఆవిర్భావ దశాబ్ది వేడుకలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, శిరందాసు కృష్ణయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

డిండి : వచ్చే నెల 2నుంచి 22 వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వీరప్ప ఆయా శాఖలాధికారులకు సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో దశాబ్ది ఉత్సవాల నిర్వాహణకు సంబంధించి మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ గిరిబాబు, సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలరాజురెడ్డి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు నిర్వహించనున్న దశాబ్ది వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతిచెందిన పాడిగేదెలు

వేములపల్లి : విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన మండలంలోని కామేపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కొండా రవి, కొండా జానకీ రాములు, బత్తిని సైదులు, బత్తిని రాంబాబులకు చెందిన పాడి గేదెలు రోజు మాదిరిగానే సోమవారం మేతకు వెళ్లాయన్నారు. కాగా సోమవారం కామేపల్లి గ్రామంలో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు నేలకొరగగా మేతకు వెళ్లిన గేదెలు తీగలను తాకగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం గేదెలు ఎంతకు ఇంటికి రాకపోవడంతో మంగళవారం వెతికిన రైతులు కామేపల్లి శివారులో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉన్నట్లు గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతిచెందిన ఒక్కో గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వాసవీ మాతకు అభిషేకం, హోమం, లలిత, విష్ణు సహస్రనామాలు, లక్ష్మీనారాణ కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వ్యాపారి నీలా లక్ష్మయ్య, ప్రేమలత దంపతులు వాసవీ మాతకు సుమారు అరకిలో వెండితో చేయించిన దండను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరె జనార్దన్, కామిశెట్టి పాండరయ్య, సోమ జగన్, తోట నర్సింహ, బూరుగు కుమార్, తేరటిపల్లి బుచ్చిరాములు, వీరమళ్ల వెంకటయ్య, తడకమళ్ల వెంకటేశ్వర్లు, బచ్చు శ్రీను, దొడ్డి మధు, పూజారులు నాగార్జు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు మంచమ్మకు నివాళి

హాలియా : అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్ తల్లి రావుల ఆకుమంచమ్మ అనారోగ్యంతో మంగళ వారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ బాధిత నివాసానికి వెళ్లి ఆకుమంచమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రావుల శ్రీనివాస్‌ను ఓదార్చి బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రావుల ఆకుమంచమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కట్టెబోయిన గురువయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండెబోయిన కోటేష్ యాదవ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రావుల చిన బిక్షం యాదవ్, ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు, నాయకులు రాజేందర్‌రెడ్డి, సంద్రాల వెంకటయ్య, సర్దార్ నాయక్, వెంకన్న తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సీపీఐ ప్రజా గర్జన సభ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజా గర్జన బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బంటు వెంకటేశ్వర్లు

వేములపల్లి : జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికై , ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రాజ్యాంగంలో వ్యవస్థల పరిరక్షణకై ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోనమనేని సాంబశివరావులు హజరువుతున్నందున ప్రతి ఒక్కరు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



మిర్యాలగూడలో దీక్ష చేస్తున్న వీఓఏలు



అడవిదేవులపల్లిలో..

మిర్యాలగూడ టౌన్ : ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మ ంగళ వారం 44వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ జేఏసి నాయకులు మాట్లాడుతూ అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, ఎస్‌హెచ్‌జీ, వీఓ లైవ్ మీటింగ్‌లను రద్దు చేయాలని, అభయాస్తం డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ విఓఏలు సుహాసిని, శేఖర్, పుష్పలత, సైదమ్మ, పి. అరుణమ్మ, ఉపేంద్ర, సైదమ్మ, నాగమణి, కవిత, సుజాత, రాణి, ఎం. అరుణ, జ్యోతి ఉన్నారు.

అడవిదేవులపల్లి : ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారం 43వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు కుర్ర నాగనాయక్ మాట్లాడుతూ దీర్ఘాకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో వీఓఏలు నర్మదా, జ్యోతి, వెంకట్, భవాని, పుష్ప, వినోద, లలిత, చెన్నయ్య, మునీ, లక్ష్మణ్, దుర్గ తదితరులున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సలీం

నల్లగొండ టౌన్ : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవురేశి మారయ్య, రవి, నాగరాజు, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ) : సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భీమగాని గణేశ్, నాయకులు మంత్రాల మంగమ్మ, లెంకల వసంత, కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, నరాల వెంకన్న, నాగరాజు, రమణ, స్రవంతి, సంధ్య, సామ్రాజ్యం, సునిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం భవనం ప్రారంభోత్సవానికి తరలిరావాలి

రామగిరి(నల్లగొండ) : బ్రాహ్మణ సంఘం భవన ప్రారంభోత్సవానికి బ్రాహ్మణులంతా తరలిరావాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాల్‌రావు కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా గోపాన్‌పల్లిలో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ సంఘం భవనం ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య సమాజ్ వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు సన్మానం



సన్మానిస్తున్న అకాడమీ నిర్వాహకులు

నల్లగొండ : ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించిన యువతీ యువకులను రామయ్య డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాగర్ రోడ్డులోగల డాన్‌బాస్కో క్యాంపస్‌లో డైరెక్టర్ శ్రీనివాస్, రామయ్య సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్నిపథ్ స్కీంలో 2023 మొదటి బ్యాచ్‌లో రామయ్య డిఫెన్స్ అకాడమీలో డిగ్రీతో పాటు డిఫెన్స్ కోర్సులో చేరి ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్‌లో భూమిక, పూజ, రోజా, శివసాయిలు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం





పెద్దవూర : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశుల మధ్య నిలిచి నీరు

పెద్దవూర : పెద్దవూర మండలంలోని మంగవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లోకి నీరు వచ్చి చేరడంతో రైతులు కాల్వ తీసి నీటిని తొడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా వర్షం రావడంతో అప్పటి వరకు ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు ధాన్యాన్ని రాసులు పోసే సరికే తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవరకొండలో భారీ వర్షం

దేవరకొండ : దేవరకొండ పట్టణంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వారం రోజులుగా ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా సేదతీరారు. వర్షం కారణంగా పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యతో కలిసి ఆయా లోతట్టు ప్రాంతాలను సందర్శించి అప్పటికప్పుడు పారిశుధ్య సమస్యను పరిష్కరించారు.



దేవరకొండ : పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిడమనూరు : నిడమనూరు మండలంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం కురిసింది. గత రెండు రోజుల క్రితం రాష్ట్రంలోనే అత్యధికంగా నిడమనూరు మండలంలో 46.1 ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఈనెల 19న మండలంలో 45.9 ఉష్ణోగ్రత నమోదైంది. అప్పుడు కూడా రెండు రోజులకు మండలంలో వర్షం కురిసింది. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎండాకాలంలో మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అతున్నాయి.

అపర భగీరథుడు సీఎం కేసీఆర్



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

కనగల్ : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి నీరు అందిస్తున్న సీఎం కేసీఆర్ అపర భగీరథుడు అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామంలో యాభై లక్షల వ్యయంతో నిర్మించనున్న మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్యాంకు నిర్మాణంతో గ్రామంతోపాటు ఆలయం వద్ద నీటి కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి సర్పంచ్‌లు అల్గుబెల్లి పూలమ్మ, అంజమ్మరామచంద్రు ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, బీఆర్ఎస్ నాయకులు అల్గుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి, జినుకుంట్ల అంజయ్య, నర్సింహ, శ్రీశైలం, రాంబాబు, అరెకంటి నర్సింహ, పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు



బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నల్లగొండ క్రైం : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి కోర్టు జైలు శిక్ష, మరికొందరికి జరిమానా విధించినట్లు నల్లగొండ ట్రాఫిక్ సీఐ చీర్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా గుర్తించామని, 15 మందిలో ముగ్గురికి 15రోజుల జైలు, మరో ఇద్దరికి రెండు రోజుల జైలు, మరింకొందరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

కరాటే బెల్టులు అందజేత

నల్లగొండ టూటౌన్ : కరాటే నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఆపద సమయంలో తనను తాను రక్షించుకోవచ్చని నల్లగొండ టూటౌన్ సీఐ నాగదుర్గ ప్రసాద్ అన్నారు. మంగళవారం నలగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమిలో జపాన్ కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి బెల్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ మాస్టర్, ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమి డైరెక్టర్ శ్రీధర్ సాగర్, నగేష్, వంశీ, పవన్, నిఖిల్, అఖిల్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో టూటౌన్ సీఐ నాగదుర్గప్రసాద్